క్లుప్తంగా

రేపు వివిధ హక్కుల వేలం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి జరిగే వేలంపాటలో వ్యాపారులు విరివిగా పాల్గొని దేవస్థానం అభివృద్ధికి తోడ్పడాలని కార్యనిర్వహణాధికారి వి.సిహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 27వ తేదీ దేవస్థానానికి సంబంధించిన కొబ్బరి చెక్కల సేకరణ, గ్యాస్ పొయ్యిల నిర్వహణ, వాహనాల పార్కింగ్ రుసుముల వసూలు, వంటసామగ్రి, షామియానాలు అద్దెకిచ్చు హక్కు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరణ, వివిధ లైసెన్స్ హక్కులు ఓ ఏడాదికి, చిన్న పెద్ద తీర్థం ఒక సంవత్సర కాలానికి లైసెన్సు హక్కులు పొందుటకు వేలంపాట నిర్వహిస్తున్నారని, ఆసక్తిగల వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి టెండర్ కమ్ బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కొత్తపేట కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ మేడా బాబు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలకు కేటాయించిన నిధులు రూ.పది లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె. చిన్నప్పరెడ్డి, టి.సుబ్బారావు, ఎస్.శౌరిరాయలు, బి.సతీష్, సాల్మన్, వి.రాము పాల్గొన్నారు.

ఉపాధి పథకం కూలీలకు వరం

ఫిరంగిపురం: వేసవిలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఒక వరం వంటిదని ఎంపీడీఓ దాసరి అనూరాధ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులకు ఎంపీడీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.చంద్రం, సర్పంచ్ డి.మెల్కియా, ఈసీ ప్రభాకర్, సచివాలయ కార్యదర్శి నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ బాజీ కుటుంబానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్షణరావు ఆర్థిక సాయం అందజేశారు. రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాజీ చికిత్స పొందుతున్నారు. మండలంలోని ఉపాధ్యాయులతోపాటు యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2,08,250 నగదును అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఆదిలక్ష్మి, ప్రధానకార్యదర్శి కళాధర్, కార్యదర్శి షకీలా బేగం, ఆదినారాయణ పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట చైతన్య తపోవన్ 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం మంగళవారం ముగిసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. మొత్తం 328 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని, వైద్యశిబిరంలో డాక్టర్ ఎంజె నాయుడు, డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణలు విశేష సేవలను అందించారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించవద్దు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించడానికి వీలులేదని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, రూరల్ పరిధిలో అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు ఎవరైనా నిర్వహిస్తుంటే వెంటనే గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు పూర్తయిన పాఠశాలలు వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

జగనన్నే మా భవిష్యత్

మంగళగిరి: నగరంలోని ఆయా వార్డుల్లో మా నమ్మకం నీవే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నగరంలో అంతర్గత రోడ్లకు మహర్దశ

- నగర పాలక సంస్థలో విలీనం చేసిన పంచాయతీరాజ్ శాఖ
- 140 కిలోమీటర్ల పొడవు కలిగిన 63 రోడ్లు
- ఎమ్మెల్యే ఆర్కే చొరవతో నగర పాలక సంస్థకు బదిలీ

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ రోడ్ల అభివృద్ధిలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మార్చి 23, 2021లో మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పాటుచేశారు. 194 కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 3లక్షల జనాభాతో మంగళగిరి, తాడేపల్లి పట్టణాలతోపాటు 21 గ్రామాల విలీనం చేశారు. 21 గ్రామాల్లోని అంతర్గత రోడ్లు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉండటంతో అభివృద్ధికి ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవ తీసుకుని 21 గ్రామాల్లోని అంతర్గత రోడ్లను నగరపాలక సంస్థకు బదిలీ చేయించారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లను నగరపాలక సంస్థకు బదిలీ చేస్తూ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి మండలంలోని 76.30 కిలోమీటర్లు కలిగిన 33 సీసీ, బీటీ రోడ్లను, తాడేపల్లి మండలంలో 61 కిలోమీటర్లు కలిగిన 30 రోడ్లను బదిలీ చేశారు. బదిలీ చేసిన వాటిలో చినకాకాని–నిడమర్రు, చినకాకాని–పెదవడ్లపూడి, చినవడ్లపూడి–చినకాకాని, కాజ–చినకాకాని, కాజ–నంబూరు, దుగ్గిరాల మండలంలోని కేఆర్ కొండూరు రోడ్డు, రామచంద్రాపురం రోడ్డు, బేతపూడి ఆర్అండ్‌బీ రోడ్డు, మంగళగిరి వయా నవులూరు రాయపూడి రోడ్డు, ఆర్అండ్‌బీ రోడ్డు యర్రబాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్, మార్కెట్ యార్డు రోడ్డు నుంచి ఆర్ అండ్‌బీ రోడ్డు వరకు, జాతీయ రహదారి నుంచి కాజ – చినకాకాని, ఆత్మకూరు రోడ్లు, నిడమర్రు–తాడికొండ రోడ్డు, నవులూరు–ఐనవోలు రోడ్డు, నూతక్కి కొత్తపాలెం–రేవేంద్రపాడు రోడ్డు, నూతక్కి–తాడేపల్లి రోడ్డు, నూతక్కి– మెల్లెంపూడి రోడ్డు, పెదవడ్లపూడి–చినవడ్లపూడి, రేవేంద్రపాడు రోడ్డు, పెదవడ్లపూడి – పెదపాలెం, పేరుకులపూడి డొంక, నూతక్కి రోడ్డు, పెదవడ్లపూడి– కేఆర్ కొండూరు, చినవడ్లపూడి–చిలువూరు రోడ్డు, జాతీయ రహదారి చినకాకాని నుంచి నిడమర్రు రోడ్డు, పాత జాతీయ రహదారి ఎన్‌హెచ్–5 నుంచి ఎన్నారై ఆసుపత్రి, మంగళగిరి రోడ్డు, నూతక్కి– కొత్తపాలెం రోడ్డు, పెదవడ్లపూడి–పెదపాలెం రోడ్డు, పేరుకలపూడి డొంక – పెదపాలెం, రామచంద్రాపురం రోడ్డు, పెదవడ్లపూడి–చినవడ్లపూడి, రేవేంద్రపాడు, కేఆర్ కొండూరు రోడ్డు, జాతీయ రహదారి కాజ పొగాకు కంపెనీ నుంచి కంతేరు రోడ్డు నగర పాలక సంస్థకు బదిలీ చేశారు. గుండిమెడ–మెల్లెంపూడి, నూతక్కి–తాడేపల్లి రోడ్డు, గుండిమెడ–కుంచనపల్లి రోడ్డు, గుండిమెడ–కుంచనపల్లి, రేవేంద్రపాడు, సీతానగరం రోడ్డు, కొండవీటి వాగు వంతెన నుంచి ఉండవల్లి వరకు రోడ్డు, కుంచనపల్లి– నూతక్కి, తాడేపల్లి రోడ్డు, జాతీయ రహదారి నుంచి ఉండవల్లి, విప్పటం, కృష్ణనగర్, రాయల్ ఫామ్, తాడేపల్లి రోడ్డు, నూతక్కి–తాడేపల్లి, మెల్లెంపూడి రోడ్డు, నూతక్కి, తాడేపల్లి, కుంచనపల్లి రోడ్డు, పెదవడ్లపూడి–కొలనుకొండ, విప్పటం రోడ్లు, పెనుమాక–కృష్ణ ఫ్లడ్ బ్యాంక్ రోడ్, పెనుమాక–వెంకటపాలెం, కృష్ణాయపాలెం రోడ్లు, ప్రాతూరు–చిర్రావూరు డొంక, ఉండవల్లి, కృష్ణా ఫ్లడ్ బ్యాంక్, నులకపేట, వెంకటపాలెం, యర్రబాలెం రోడ్లు, చిర్రావూరు, ఇసుక క్వారీ ర్యాంప్, చిర్రావూరు గంగమ్మ టెంపుల్ రోడ్, గుండిమెడ– మెల్లెంపూడి, రేవేంద్రపాడు, సీతానగరం రోడ్లు, గుండిమెడ–కృష్ణా కరకట్ట రోడ్డు, నూతక్కి–తాడేపల్లి, కుంచనపల్లి రోడ్లు, కుంచనపల్లి ఆంధ్రారత్న పంపింగ్ కెనాల్ రోడ్డు, కొలనుకొండ–వడ్డేశ్వరం రోడ్డు, ప్రాతూరు ఎస్సీ కాలనీ, కరకట్ట రోడ్లు నగరపాలక సంస్థకు బదిలీ చేశారు. రోడ్ల బదిలీతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగనుండటంతో నగరం మరింత శరవేగంగా అభివృద్ధి చెందనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిడమర్రు-కురగల్లు రోడ్డు

బదిలీతో వేగంగా అభివృద్ధి



మంగళగిరి–తాడేపల్లి 21 గ్రామాలతో కలిపి నగరపాలక సంస్థగా అవతరించినా గ్రామాల్లోని రోడ్లు పంచాయతీరాజ్ శాఖ కింద ఉండటంతో రోడ్ల అభివృద్ధికి ఇబ్బందిగా మారింది. నగరపాలక సంస్థలో పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్లు బదిలీ కావడంతో ఇక నుంచి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి పనులు చేసే అవకాశం కలిగింది. రోడ్ల బదిలీతో నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

ప్రతి గడపకూ చేరువైన సంక్షేమం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



కంతేరు(తాడికొండ): పార్టీలకతీతంగా ప్రతి గడపకూ సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం కంతేరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, ఎంపీటీసీ వలపర్ల కల్పన, ఉప సర్పంచ్ నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ల శివనాగరాజు యాదవ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి వెంకట్రావు, తోకల నరసింహారావు పాల్గొన్నారు. గుంటూరు భారత్‌పేటలోని తన కార్యాలయంలో ముఖ్య నాయకులు, జేసీఎస్ కన్వీనర్లతో మంగళవారం సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలపై ప్రస్తావించినట్లు తెలిపారు.

సబ్ స్టేషన్ల నిర్మాణంతో తీరిన
విద్యుత్ సమస్య

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- అత్యాధునిక జర్మన్ టెక్నాలజీతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రూ.15 కోట్లతో నిర్మించనున్న రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపన

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో విద్యుత్ సమస్యకు శ్వాశత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద, రత్నాలచెరువు శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో నూతనంగా రూ.15 కోట్లతో నిర్మిస్తున్న రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి ప్రాంతాలు నగరంగా ఆవిర్భవించిన అనంతరం ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటికే ఐదు పూర్తయి అందుబాటులోకి వచ్చాయన్నారు. మరో రెండింటికి శంకుస్థాపన జరిగిన నేపథ్యంలో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ చుట్టూ ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆధునిక జర్మన్ టెక్నాలజీతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించడం జరుగుతుందన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌తో టిడ్కో నివాసాలతోపాటు రాజీవ్ గృహకల్ప కాలనీ, మార్కేండేయనగర్‌లతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. రత్నాలచెరువు శ్రీ లక్ష్మీనృసింహస్వాకాలనీ వద్ద ఏర్పాటు చేస్తున్న సబ్ స్టేషన్‌తో రత్నాల చెరువు, లక్ష్మీనృసింహపురం కాలనీతో ఆత్మకూరు, ఇప్పటం రోడ్డు చివర వరకు విద్యుత్ సరఫరా చేసేందుకు అనువుగా నిర్మించడం జరిగిందన్నారు. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు సబ్‌స్టేషన్‌ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సీఎండీ పద్మ జనార్ధనరెడ్డి, నగర కమిషనర్ యు శారదా దేవి, డీఈ కృష్ణారెడ్డి, డాక్టర్ పి విజయకుమార్, డీఈఈ అక్కల సత్యనారాయణ, ఏఈ చిరంజీవిలతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, సీఎండీ పద్మజనార్ధనరెడ్డి

ఆర్మీ ఉద్యోగి భార్య ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిరూరల్: ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న తన భర్త తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెంది తన మూడు నెలల చిన్నారితో కలసి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..తిరుపతికి చెందిన నాగరాజు, ఉషారాణిల కుమారుడు వేణుగోపాలనాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. విశాఖపట్నంకు చెందిన భానును 2019లో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి మూడు నెలల చిన్నారి ఉంది. పాప పుట్టిన దగ్గర నుంచి పట్టించుకోకపోవడం, మాట్లాడకపోవడంతో భాను పాపను తీసుకుని హిమాచల్‌ప్రదేశ్ వెళ్లింది. అక్కడ కూడా భార్యతో మాట్లాడకుండా ఇబ్బంది పెట్టాడు. అనంతరం తిరిగి మరల విశాఖపట్నంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన భాను దగ్గరకు 20 రోజుల క్రితం వేణుగోపాల్ వచ్చి తిరిగి మరల తిరుపతి వెళ్లి ఆమెతో మాట్లాడకపోవడంతో మనస్తాపం చెందిన భాను ఆదివారం వైజాగ్‌లోని పుట్టింటి నుంచి బయటకు వచ్చి మంగళవారం ఉదయం విజయవాడ వచ్చి ప్రకాశంబ్యారేజ్‌పై అనుమానాస్పదంగా తిరిగింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన ప్రకాశం బ్యారేజ్ ఔట్ పోస్ట్ సిబ్బంది ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలుపడంతో విశాఖలో ఉన్న భాను తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం భానును, చిన్నారిని మేరీ హోమ్స్‌లో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి బస్తాల మాయంపై సీరియస్

- రికార్డులు, నిల్వలను పరిశీలించిన ఎస్పీ ఆరిఫ్ హఫీజ్
- విచారణాధికారిగా ఏఎస్పీ నియామకం

మంగళగిరి: మంగళగిరి రూరల్ స్టేషన్ నుంచి గంజాయి బస్తాల మాయంపై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం మంగళగిరి రూరల్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. గంజాయి కేసులకు సంబంధించిన రికార్డులు, గంజాయి నిల్వలను పరిశీలించారు. అనంతరం పట్టణ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి బస్తాల మాయంపై విచారణకు ఏఎస్పీ అనిల్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. గంజాయి బస్తాల మాయం వ్యవహారంలో అధికారులు, సిబ్బంది పాత్రపై వచ్చిన ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి అనిల్‌కుమార్, నార్త్‌జోన్ డీఎస్పీ జె రాంబాబు, పట్టణ, రూరల్ ఎస్ఐలు బి అంకమ్మరావు, వి భూషణం, ఎస్ఐలు మహేంద్ర, రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

మలుపులు తిరుగుతున్న బస్తాల మాయం

స్టేషన్‌లో ఎన్ని బస్తాల గంజాయి మాయమైందనే దానిపై అధికారులకు స్పష్టత లేదని తెలుస్తుంది. శనివారం రాత్రి ఒక బస్తా గంజాయి మాయమైనట్లు పోలీసులు చెబుతున్నా వాస్తవానికి మూడు బస్తాల గంజాయి మాయం కాగా పారిపోయిన నిందితులు రెండు బస్తాల గంజాయిని పాత రైల్వేగేటు అవతల తగులబెట్టినట్లు తెలిసింది. గంజాయి తగలబడుతుండగా వాసన గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది చేరుకుని పరిశీలించారు. గంజాయి బస్తాలు తగులబడుతున్న సమయంలో సిబ్బందికి, స్టేషన్‌కు సంబంధించిన బీటు పుస్తకం సైతం ఘటనా స్థలంలో లభించినట్లు సమాచారం. గంజాయి బస్తాల మాయం వెనుక పట్టణ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం రాత్రి రక్షక్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మూడు గంటలకు పట్టణ స్టేషన్‌కు చేరుకుని వాహనం అక్కడ ఉంచి రూరల్ స్టేషన్ ఆవరణలోని గంజాయి నిల్వల వద్దకు వెళ్లి సుమారు గంటపాటు ఉన్నట్లు సీసీ టీవీ ఫుటేజిలో అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కానిస్టేబుల్ గంజాయి నిల్వల వద్ద ఉన్న సమయంలోనే గంజాయి బస్తాలు బయట గోడ వెనుకకు పడటం పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది సహకారంతోనే గంజాయి బస్తాలు తరచూ మాయమవుతున్నట్లు పోలీసు వర్గాలే పేర్కొనడం గమనార్హం.



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

మంగళగిరి: ప్రపంచ వ్యాప్తంగా మలేరియా గణనీయంగా తగ్గుముఖం పట్టిందని, పూర్తిగా నివారించేందుకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని నగర పాలక సంస్థ వద్ద ఆమె మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా నివారణకు వ్యాధి నిర్ధారణ పరీక్షలలో సత్వర విధానాలు, చికిత్సలో సంయుక్త ఔషధాలు వాడకం, దోమల నియంత్రణకు వినియోగించే నూతన కీటక సంహారిణిలు, ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం వలన సాధ్యమైందన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు దోమల నివారణకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, ఎయిమ్స్ డాక్టర్ రాజీవ్, సూపర్‌వైజర్ పద్మజ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఏ శ్రీమన్నారాయణ, సిబ్బంది టి ప్రసాద్, సాగర్, వాసు, మూర్తి, నరసింహారావు, ఫ్లెమింగ్, ఏఎన్ఎంలు, ఆశాలు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, ఎన్ఆర్ఐ, ఎయిమ్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని

తాడేపల్లిరూరల్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురం, నూతక్కి గ్రామాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలకు మలేరియా వ్యాధి లక్షణాలు, మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌హెచ్ఎ ఎయిమ్స్ డాక్టర్ ఆర్తి, సీహెచ్‌వో గ్రేస్ రాబర్ట్, హెచ్ఎస్ కొల్లి శివశంకరరావు, హెచ్‌వీ సులోచనరాణి, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొన్నెకల్లు(తాడికొండ): దోమల నివారణకు సమష్టి చర్యలు అవసరమని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కె తిరుమలాదేవి అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుళ్లూరు పీహెచ్‌పీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బీఎస్‌కే భార్గవ్, ఎస్ఎస్ సిద్దార్థ రెడ్డి, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వరరావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- అభివృద్ధి పనులు పరిశీలన

మంగళగిరి: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. నగరంలోని ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్డులోని శ్రీరామానగర్‌లో రూ.1.50 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ, డ్రైనేజీ, డివైడర్ నిర్మాణ పనులను పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా ఆర్చిలు ఏర్పాటు చేసి సర్దార్ వల్లభాయి పటేల్ మార్గంగా నామకరణం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నగరంలోని గోలి రామనాథం శ్మశానవాటిక, ఆత్మకూరు తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న పంప్ హౌస్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పద్మశాలీయ శ్మశానవాటిక, యర్రబాలెంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతలో రాజీ పడకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. వేసవి నేపథ్యంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్‌లు మరో 10 రోజుల్లో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పలువురు స్థానికులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించి అవసరమైన వీధి లైట్లు, తాగునీటి వసతితోపాటు మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో నగర కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



శ్రీరామనగర్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

సమస్యలపై అధికారులతో సమీక్ష

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్‌ప్రాంతాల్లో సమస్యలపై అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ ప్రాంతంలో పలుచోట్ల అభివృద్ధి పనులతోపాటు ముఖ్యంగా తాగునీటి సమస్యను అధిగమించేందుకు ఈ సమావేశం నిర్వహించామని, గత 40 ఏళ్ల కిందట పైపులైన్లు ఏర్పాటుచేశారని, ఎక్కువ శాతం బోరువాటర్ ఉపయోగించడం వల్ల సిల్టు పేరుకుపోయిందని, వాటన్నింటిని గుర్తించి వాటి స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయడం, తాడేపల్లి కొత్తూరు, పాతూరులో పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. రూరల్ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందడంతో బహుళ అంతస్తుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని వాటి నుంచి వెలువడే మురుగు వల్ల ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ పంటకాలువ మురుగు కాలువగా మారిందని, ఆ కాలువలో మురుగు కలవకుండా ప్రత్యామ్నాయంగా రోడ్డు వెంబడి సీసీ డ్రెయిన్ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రతిపాదలను సిద్ధం చేయమన్నామని తెలిపారు. సమావేశంలో ఎంటిఎంసి కమిషనర్ శారదాదేవి, తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, ఆర్వో మురళి, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూలో మహిళా ఐడియాథాన్

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం స్టార్టప్ ఫౌండేషన్ కమ్యూనిటీ మహిళా సెంట్రిక్ ఐడియాథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏసీఐసీ సీఈఓ అలోక్ గోవిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్లు అంటే ఏమిటి, వాటి ప్రాముఖ్యతలు ఎలా ఉంటాయనే విషయాలను వివరించామని, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన మహిళా ఆవిష్కర్తలకు నూతన ఆవిష్కరణల గురించి అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పరిశోధన, వ్యాపార నిపుణుడు రమణకాంత్, పరిశోధన, బిజినెస్ నిపుణులు రోహన్ అండే, డిజైన్ నిపుణులు శివప్రసాద్, వ్యాపార పరిశోధనా నిపుణురాలు శ్రుతి భార్గవ, మాటేటి అశ్విన్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

తాడేపల్లిరూరల్ : ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన 9వ ఏపీ ఇంటర్ సీనియర్ జిల్లా స్థాయి వుషు చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం యాజమాన్యం అభినందించింది. విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుంటూరుకు చెందిన ఎం.గోపిచంద్, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న డి.ఆదిత్య, ట్రిపుల్ ఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.బ్రహ్మేంద్రలు జిల్లాస్థాయిలో రజత పతకాలు సాధించారని అన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.